న్యాయ పూర్తి వివరణ

న్యాయ పరిధి : మహిళా చట్టాలు
సెక్షన్ పరిధి : సాంఘిక చట్టాలు
ఉప సెక్షన్ పరిధి : మనోవర్తి

## సంక్షిప్తంగా న్యాయ సమాచారం

తన భార్యని, మైనరు పిల్లలను, తన తల్లి తండ్రులను పోషించుకోవడం ప్రతి వ్యక్తి యొక్క ప్రాధమిక బాధ్యత. అటువంటి మౌలికమైన బాధ్యతను అతను చేపట్టడానికి నిరాకరిస్తే లేక విస్మరిస్తే, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, సెక్షన్ 125 కింద పిటీషను వేసి సదరు వ్యక్తి చేత చట్ట బద్ధంగా మనోవర్తి పొందవచ్చు. సమ్మరి(క్లుప్తమైన) విచారణ ద్వారా త్వరతగతిగా న్యాయం చేకూర్చడమే ఈ నిబంధన యొక్క ఉద్దేశ్యము. తమను తాము పోషించుకోలేని మహిళలకి, పిల్లలకి, పెద్దవారికి సామాజిక న్యాయము చేకూర్చడమే ఈ నిబంధన యొక్క ముఖ్యోద్దేశ్యము. ఒక భార్య తన భర్తనుండి మనోవర్తి ఎలా పొందవచ్చో తెలుసుకుందాము.

## విపులంగా న్యాయ వివరాలు

భర్త నుండి దూరంగా ఉంటూకూడా భార్య అతని నుండి మనోవర్తి పొందవచ్చు. భర్త ఇంకొకరిని పెళ్ళాడాడని లేదా ఇంకొకరితో జీవిస్తున్నాడని తగు కారణాలు చూపించి భార్య అతనితో కలిసి జీవించడానికి నిరాకరించవచ్చు. విడాకులు పొందిన మహిళ, తాను రెండవ వివాహము చేసుకోనంత కాలము తన భర్త నుండి మనోవర్తి పొందవచ్చు. విడాకులకు సంబంధించిన వ్యవహారాలు కోర్టులో పెండింగు ఉండగానే, నెలనెలా ఖర్చులకు మరియు కోర్టు ఖర్చులకు 'మధ్యకాలిన మనోవర్తి' (ఇంటెరిమ్ మైంటెనన్స్) ఇవ్వవలసిందిగా మేజిస్ట్రేటుగారు ఆదేశించవచ్చు. నోటీసు పంపిన 60 రోజుల్లోగా మేజిస్ట్రేటుగారు ఈ ఆదేశాలు జారీ చేయాల్సి ఉంటుంది. మనోవర్తి ఆదేశాలు జారీచేసేముందు ఈ క్రింది వాటిని మేజిస్ట్రేటుగారు పరిగణలోకి తీసుకుంటారు.

- భర్త సంపాదన ఆర్జించే స్థితిలో ఉన్నాడు. భర్తకు సంపాదన లేదా ఆస్తి లేకపోయినా అతనికి సంపాయించే పరిస్థితులు ఉన్నాయో లేవో చూస్తారు.
- భార్యను నిర్లక్ష్యం చేశాడు
- ఆ స్త్రీ తనను తాను పోషించుకునే పరిస్థితిలో లేదు.
- ఉద్యోగస్తురాలైన స్త్రీ కూడా తన సంపాదన తనను తాను పోషించుకోవడానికి సరిపోకపోతే మనోవర్తి కోరవచ్చు.
- భార్యకు శరీరక శక్తి ఉన్నదనో లేక చదువుకున్నది కాబట్టి ఉద్యోగం చేయచ్చనో భర్త వాదించుటకు వీలు లేదు. భార్య వైపు బంధువులు, ఆమె యొక్క తల్లితండ్రుల స్థితిగతులు కూడా పరిగణించబడదు.

ఈ క్రింది సందర్భాలలో మనోవర్తి రద్దు చేయబడుతుంది

- భార్య రెండవ వివాహము చేసుకున్నపుడు
- విడాకుల సమయంలో మనోవర్తి హక్కులను ఆమె వదులుకున్నపుడు.
- పర్సనల్ లా లేదా వారి ఆచారాల ప్రకారము విడాకుల సమయములో ఇవాల్సిన సొమ్ము మొత్తం ఇచ్చివేసినపుడు.

అయితే మనోవర్తి ఎంత ఇవ్వాలన్నది మేజిస్ట్రేటుగారు వివేచనతో నిర్ణయిస్తారు పిటిషనరు యొక్క అవసరాలను బట్టి, భర్త యొక్క ఆర్థిక స్థితి బట్టి మనోవర్తి మొత్తము నిర్ణయించబడుతుంది. పూర్వము మనోవర్తి ఐదువందలకు మించరాదన్న సీలింగు అమెండమెంటు ఆక్టు; 2001 ద్వారా రద్దు చేయబడింది.

## పరిష్కార పద్ధతి

## సెక్షన్ పేరు

సెక్షన్ 125 - మేజిస్ట్రేటుగారు ఆదేశాలు ఎప్పుడు జారి చేస్తారు అనే విషయాలు.
సెక్షన్ 126 - దరఖాస్తు వేయుటకు ప్రొసీజర్
సెక్షన్ 127 - మనోవర్తి మొత్తమును మార్చుట
సెక్షన్ 128 - కోర్టు ఆదేశాలను అమలు పరుచుట

## ఫిర్యాదు ఎవరికి ఇవ్వాలి / ఎక్కడ ఇవ్వాలి ?

ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేటుకు ఈ నిబంధన కింద దరఖాస్తు చేయవలసి ఉంటుంది భార్యగాని భర్తగాని నివసిస్తున్న స్థలములో గాని, లేదా ఇద్దరు కలిసి పూర్వము నివసించిన స్థలములో గాని దరఖాస్తు వేయవచ్చు.

## కేసు ఫైల్ చేయడం ఎలా ?

పిటిషనర్ జడ్జిగారికి ఈ క్రింది ఆధారాలు చూపాలి.

- ఆమె చట్టపరంగా వివాహం చేసుకున్న భార్యఅని
- ఉద్దేశ్యపూర్వకంగానే భర్త భార్యను నిర్లక్ష్యం చేస్తున్నాడని
- తనను తాను, తన పిల్లలను పోషించుకోలేని పరిస్థితుల్లో ఉన్నదని

భర్త ఉద్దేశ్యపూర్వకంగా కోర్టుకు హాజరు కాకపోతే కోర్టువారు ఏకపక్ష డిక్రిని జారీ చేయవచ్చు. డిక్రి వచ్చిన మూడునెలలలోపు సరైన కారణాలు చూపిస్తే, డిక్రీ రద్దుచేయబడవచ్చు.

## తరువాత

ఒక వేళ భర్త ఉద్దేశ్యపూర్వకంగా కోర్టు ఆదేశాలను పాటించకపోతే, కోర్టువారు అతని పై వారంటు జారీ చేయవచ్చు. అయినా కుడా అతన మనోవర్తి మొత్తము చెల్లించకపోతే, ఒక నెలవరకు జైలు శిక్ష నిధించవచ్చు. బకాయిలకోసం వేసే పిటిషను బకాయి పడ్డ ఏడాదిలోపు వేయవలసి ఉంటుంది.

## ప్రత్యామ్నాయ పరిష్కారం

ప్రత్యామ్నాయము లేదు